ఏటీసీ సెంటర్లతో ఉద్యోగావకాశాలు

హత్నూరలో నిర్మిస్తున్న ఏటీసీ భవనం పరిశీలించిన కలెక్టర్

హత్నూర, అక్టోబర్19 : ఏటీసీ (అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల)ల ఏర్పాటుతో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని జిల్లా కలెక్టర్ క్రాంతివల్లూరు తెలిపారు. శనివారం మండలకేంద్రమైన హత్నూర ఐటీఐ ప్రాంగణంలో రూ.4.50కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న ఏటీసీ సెంటర్ భవనం నిర్మాణం పనులు పరిశీలించారు. ఈనెల 30లోపు ఏటీసీ సెంటర్లలో పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులచే సీట్లభర్తీకి చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. భవనం నిర్మాణంపనుల్లో వేగంపెంచి డిసెంబర్‌లోపు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఐటీఐ పరిసరాలు పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం హత్నూర ప్రభుత్వ దవాఖానను పరిశీలించిన కలెక్టర్ రోగులతో ముచ్చటించారు.

ప్రభుత్వ ఐటీఐలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

కేజీబీవీ పాఠశాలలుసందర్శించిన కలెక్టర్

హత్నూరలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను కలెక్టర్ క్రాంతివల్లూరు ఆకస్మికంగా తనిఖీచేశారు. గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనం పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. మెరుగైన విద్యాభ్యాసం చేయాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను తనిఖీచేసిన కలెక్టర్ విద్యార్థులు డైనింగ్‌హాల్‌లో కాకుండా వరండాలో నేలపైకూర్చొని భోజనంచేయడంపట్ల ఆగ్రహం వ్యక్తంచేశారు. తహసీల్దార్ ఫర్హీన్‌షేక్, ఎంపీడీవో శంకర్, ఆర్ఐ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సుబ్బలక్ష్మి, భిక్షమయ్య, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సాగులో సస్య రక్షణ చర్యలు పాటించాలి

కూరగాయల సాగు విధానంపై మహిళా రైతులకు అవగాహన కల్పించిన విద్యార్థులు

సంగారెడ్డి, అక్టోబర్ 19 : వానకాలంలో రైతులు పండించే పంటల సాగులో తప్పనిసరిగా సస్య రక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగబడులు వస్తాయని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం కళాశాల విద్యార్థులు రైతులకు అవగాహన కల్పించారు. శనివారం మండల పరిధిలోని ఫసల్‌వాది గ్రామంలో జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం నాల్గో రోజు రైతుల క్షేత్ర సందర్శన చేసి రైతులకు పంటలలో తెగుళ్ల నియంత్రణ పద్ధతులు, పురుగుల నియంత్రణపై సమగ్ర సస్య రక్షణ పద్ధతులపై మార్గదర్శకం చేశారు. వరిలో మొగి పురుగు (కాండం తొల్చే పురుగు) బెడద ఎక్కువగా ఉందని గుర్తించి వాటి నివారణకు లింగాకర్షణ బుట్టలు అమర్చుకునే విధానాన్ని రైతులకు విద్యార్థులు చూపించారు. పత్తిలో రసం పీల్చే పురుగుల నివారణకు పసుపు రంగు జిగురు అట్టలు అమర్చితే పురుగుల నివారణ సాధ్యమవుతుందని, అట్టలు పంపిణీ చేశారు. మహిళా రైతులకు పెరటి తోటల పెంపకంపై అవగాహన కల్పించి, వారికి కూరగాయల విత్తనాలు, కిట్లు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ రైతులు, మహిళలు, ప్రోగ్రాం అధికారులు ఉపేందర్, సుమాలిని, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను నిర్మించాలి

కమిషనర్ మంగతాయారుకు వినతి పత్రాన్ని అందజేస్తున్న కాలనీ వాసులు

బొల్లారం, అక్టోబర్ 19 : బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని ఎస్సీ బస్తీలో నూతనంగా ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరుతూ బస్తీ వాసులు కమిషనర్ మంగతాయారును శనివారం కార్యాలయంలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ గతంలో దివంగత మాజీ సర్పంచ్ ప్రతాప్ రెడ్డి హయాంలో కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మించారు. కాలక్రమంలో ప్రజల అవసరాల నిమిత్తం కమ్యూనిటీ హాల్‌ను బస్తీ దవాఖానగా మార్చారు. ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ పెద్దలు అప్పటి కమిషనర్ మరో చోట భవనాన్ని నిర్మిస్తామని తెలిపారు. పాలకవర్గ సభ్యుడు వేణు గోపాల్ రెడ్డి కౌన్సిల్ సమావేశంలో మా సమస్యపై సభలో ప్రస్తావించినా ఫలితం లేదని వాపోయారు. బస్తీలో నూతన కమ్యూనిటీ హాల్ నిర్మించాలని ఈ మేరకు అధికారులను విజ్ఞప్తి చేశారు. బస్తీ వాసులు ప్రవీణ్ కుమార్, యాదగిరి, శ్రీనివాస్, రామకృష్ణ, ముత్యాలు, కాశీ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పూర్వవైభవానికి కృషి

కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న మండల నాయకులు

గుమ్మడిదల,అక్టోబర్19: బీఆర్‌ఎస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి కలిసికట్టుగా కృషి చేస్తామని ఆపార్టీ మండల నూతన అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రమైన గుమ్మడిదలలో బీఆర్‌ఎస్ నాయకులు, వివిధ గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సందర్భంగా గుమ్మడిదల మండల బీఆర్‌ఎస్ నూతన అధ్యక్షుడిగా కొత్తపల్లి గ్రామానికి చెందిన నాయకుడు, మాజీ ఎంపీటీసీ కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డిని మండల నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడుగా కొత్తపల్లి మల్లేశ్‌గౌడ్‌ను, ప్రధాన కార్యదర్శిగా అన్నారం గ్రామానికి చెందిన బీ. నరహరిని ఎన్నుకున్నారు. నాయకులు పాల్గొన్నారు.

'పది'లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వర్లు

జిన్నారం, అక్టోబర్ 19 : పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కృషి చేయాలని డీఈవో వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం కొడకంచి గ్రామంలోని ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించారు. విద్యార్థుల తరగదికి వెళ్లి వారితో మాట్లాడారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో పట్టు సాధించేలా ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై దృష్టి పెట్టాలన్నారు. అనంతరం డీఈవో వెంకటేశ్వర్లును పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. హెచ్ఎం ప్రేమవతి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ధర్మ రక్షణ కోసమే యజ్ఞం



యజ్ఞంలో పాల్గొన్న అడిషనల్ ఎస్పీ సంజీవరావు, డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి

ఝరాసంగం, అక్టోబర్ 19 : దేశం, రాష్ట్రం సుభిక్షం విశ్వశాంతి ధర్మ రక్షణ కోసమే మృత్యుంజయ మంత్ర సహస్ర మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు దీని ప్రభావంతో కలుషితమైన వాతావరణాన్ని పరిశుభ్ర పరుస్తుదనీ ఆశ్రమ పీఠాధిపతులు అవధూత గిరి మహారాజ్, సిద్దేశ్వరానందగిరి మహారాజ్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమం యజ్ఞశాలలో విశ్వశాంతి, లోక కల్యాణార్థం మృత్యుంజయ మహాయజ్ఞాన్ని వైదిక మంత్రాలతో శాస్త్రోత్తంగా ప్రారంభించారు. మృత్యుంజయ యాగానికి సంగారెడ్డి జిల్లా అడిషనల్ ఎస్పీ సంజీవరావు, జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి, ఝరాసంగం ఎస్సై నరేశ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విశిష్ట అతిథులు కొండపూర్ సంగ్రామ్ మహారాజ్, వీరేశ్వర శివాచార్య, విశ్వా నందగిరి మహారాజ్, విశ్వమాను ధర్మ ప్రచార సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సాగులో యాంత్రీకరణకు ప్రోత్సాహం

ఏపీజీవీబీ రాష్ట్ర చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

జహీరాబాద్, అక్టోబర్ 19 : కేంద్ర ప్రభుత్వ సహకారంతో రానున్న పదేండ్లలో రైతులు యాంత్రీకరణ సాగు చేసేందుకు రూ. వంద కోట్ల రుణాలను మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీజీవీబీ రాష్ట్ర చైర్మన్ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం జహీరాబాద్ పట్టణంలోని ఏపీజీవీబీ బ్యాంకు ద్వారా రూ. 5 కోట్ల రుణంతో రైతులకు మంజూరు చేసిన నాలుగు చెరుకు హార్వెస్టింగ్ యంత్రాలను పంపిణీ చేశారు. జహీరాబాద్ ఏపీజీవీ బ్యాంకు ద్వారా స్వయం సహాయ సంఘాలకు మంజూరు చేసిన రూ. 10 కోట్ల రుణాల చెక్కులను అందజేశారు. ఏపీజీవీబీ బ్యాంకు సంగారెడ్డి రిజినల్ జోనల్ మేనేజర్ సమత, బ్యాంకు అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత



సభ్యత్వం చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే భుపాల్‌రెడ్డి

నిజాంపేట్,అక్టోబర్19 : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబ సభ్యులకు రెండు లక్షల పార్టీ బీమా చెక్కును శనివారం మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి అందజేశారు. సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన నిజాంపేట్ గ్రామానికి చెందిన కరిపే బాలకిషన్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయనకు బీఆర్‌ఎస్ పార్టీ క్రియ శీల సభ్యత్వం ఉన్నందున రూ. రెండు లక్షల బీమా చెక్కును, మృతుడి కుమారుడు ఉదయ్‌కి అందజేశారు. నారాయణఖేడ్ మాజీ జడ్పీటీసీ రవీందర్ నాయక్, మున్సిపల్ కౌన్సిలర్ ముజామ్మిల్, వైస్ ఎంపీపీ సాయి రెడ్డి, నాయకులు ఉన్నారు.

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ సీడీసీ చైర్మన్ బుచ్చిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు

రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డిని కలిసిన సమితి నాయకులు

సంగారెడ్డి, అక్టోబర్ 19 :ఎన్నికలు రాగానే తెలంగాణ ప్రజలు, రైతులను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వకుండా మరో మోసానికి తెరలేపిందని మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రజలను నమ్మించి మోసం చేయడంలో ముఖ్యమంత్రికి సాటిలేరని ఎద్దేవా చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్. వెంకటేశ్వర్లు, నర్సింహులు, కాన్సిలర్ విష్ణువర్ధన్, నాయకులు జీవి శ్రీనివాస్, దిడ్డి విఠల్, చింటూ తదితరులు పాల్గొన్నారు.

కమిటీలతో కాలయాపన

సంగారెడ్డి, అక్టోబర్19 : రైతులకు రుణ మాఫీతో ఏమి లాభం లేదని, రైతులకు పనికిరాని కమిటీలు ఎందుకని, గ్రామాల్లోకి బ్యాంకు అధికారులు వెళ్లి రైతు రుణమాఫీ చేసి రీషెడ్యూల్ చేయాలని తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు కాసాల రాఘవేందర్‌రెడ్డి కమిటీని ప్రశ్నించారు. శనివారం హైదరాబాద్‌లో రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతు సంఘాల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా నుంచి రైతు రక్షణ సమితి నాయకులు తరలివెళ్లి పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

జహీరాబాద్, అక్టోబర్ 19 : యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని స్కోప్ స్వచ్ఛంద సంస్థ న్యాల్‌కల్ మండల కో-ఆర్డినేటర్ శంకర్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన న్యాల్‌కల్, వడ్డి, చాల్కి గ్రామాల్లో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు కళాజాత బృందం సభ్యులు ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కోప్ స్వచ్ఛంద సంస్థ, కళాజాత బృందం సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

మాట్లాడుతున్న జోగిపేట మున్సిఫ్ న్యాయాధికారి ధనలక్ష్మి

చౌటకూర్, అక్టోబర్ 19 : విద్యార్థులు చట్టాలపై అవగాహన ఎంతగానో అవసరమని జోగిపేట మున్సిఫ్ న్యాయాధికారి ధనలక్ష్మి అన్నారు. మండల కేంద్రం చౌటకూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం లీగల్ అవేర్నెస్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకుని చదువుకోవాలని, అప్పుడే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని అన్నారు. ఇన్‌చార్జి ఎంఈవో కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు మోహన్‌రెడ్డి, మల్లేశం, రాజు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగలు పారిశ్రామిక రంగంలో రాణించాలి

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 19: మాదిగలు పారిశ్రామిక రంగంలో రాణించాలని ఎమ్ఐసీసీఐ అధ్యక్షుడు సుంచు రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో పారిశ్రామిక అవగాహన సదస్సును ఎమ్ఐసీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదిగలు ఆర్థికం గా ఎంతో వెనుకంజలో ఉన్నారని తెలిపారు. ఎమ్ఐసీసీఐ ద్వారా ఆర్థిక అభివృద్ధిని సాధించాలన్నారు. జిల్లా పరిశ్రమల సంస్థ జనరల్ మేనేజర్ ప్రశాంత్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, ఎంఎస్ఎంఈ యూసుఫ్‌గూడ ప్రతినిధి కోటేశ్వరరావు, ఎమ్ఐసీసీఐ ప్రధాన కార్యదర్శి బక్క నర్సింహా, కోశాధికారి సత్యేంద్ర కుమార్, ఉపాధ్యక్షుడు సుధాకర్, మాధవి, జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో కార్మికుడు మృతి

జిన్నారం, అక్టోబర్ 19 : గడ్డపోతారం పారిశ్రామికవాడలోని సెల్‌మార్ ల్యాబ్ పరిశ్రమలో ఓ కార్మికుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. కార్మికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సెల్‌మార్ ల్యాబ్ పరిశ్రమలో భద్రాచలానికి చెందిన పీ.రాజేశ్ (31) కొంతకాలంగా విద్యుత్ విభాగంలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే డ్యూటీకి వచ్చిన రాజేశ్ చిల్లింగ్ ప్లాంట్ పైన విధులు నిర్వహిస్తుండగా, ప్రమాదవశాత్తు జారి ట్యాంక్‌లో పడి మృతి చెందాడు. ప్లాంట్‌పైభాగంలో పని చేస్తున్న క్రమంలో ఎలాంటి సేఫ్టీ పరికరాలు పరిశ్రమ ఇవ్వకపోవడంతో రాజేశ్ జారి చిల్లింగ్ వాటర్ ప్లాంట్‌లో పడి మృతి చెందాడని కొందరు కార్మికులు తెలిపారు. బొల్లారం సీఐ గంగాధర్, సిబ్బందితో వచ్చి సంఘటన స్థలాన్ని పరిశీలించారు.ఈ ఘటనపై అధికారులు పూర్తి విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

సదాశివపేటలో బంద్ ప్రశాంతం

హిందు సంఘాల భారీ ర్యాలీ

సంగారెడ్డి, అక్టోబర్ 19 : సదాశివపేటలో హిందూ దేవాలయాలపై ఒక వర్గానికి చెందిన వ్యక్తులు కావాలని అలజడి సృష్టించి హిందూ-ముస్లింల్లో గొడవలు చేసే ప్రయత్నం చేసిన నిందితులపై పోలీసులు చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని పేట బంద్‌కు హిందూ సంఘాలు పిలుపునిచ్చాయి. శనివారం పట్టణంలోని దుకాణా సముదాయాలను స్వచ్ఛందంగా బంద్ పాటించి నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమం విశ్వహిందూ పరిషత్, హిందూ సంఘాల ఆధ్వర్యంలో పట్టణ పుర వీధుల్లో బంద్ పాటిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణ పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ సత్తయ్యగౌడ్‌కు ఫిర్యాదు అందజేశారు. ముఖ్యంగా స్థానిక ప్రభు మం దిర్ దగ్గర ఉన్న హనుమాన్ ఆలయంలోని గణేశ్ విగ్రహం, హనుమంతుడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులపై చర్యలు తీసుకోవాలని పోలీసులను డిమాండ్ చేశారు. ర్యాలీ కి కుల మతం, రాజకీయ పార్టీలకు అతీతంగా తరలివచ్చి స్వచ్ఛందంగా పాల్గొని నిరసన తెలిపారు. ర్యాలీకి పట్టణ పోలీసు యంత్రాంగం గట్టి బందోబస్తు నిర్వహించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గస్తీ నిర్వహించారు. ఈ ర్యాలీలో తంగడపల్లి మల్కేడ్ అప్ప, విశ్వహిందూ పరిషత్, హిందూ సాంఘాల నాయకులు పాల్గొన్నారు.

హిందూ సంఘాల ఆధ్వర్యంలో పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించిన నాయకులు

ప్రభుత్వం బ్యాడ్మింటన్‌ను ప్రోత్సహించాలి

బ్యాడ్మింటన్ క్రీడాకారుడు నవనీత్‌బొక్క

రామచంద్రాపురం,అక్టోబర్19: కామన్‌వెల్త్ గేమ్స్‌లో బంగారు పతకం సాధించడమే తన లక్ష్యమని బ్యాడ్మింటన్ క్రీడాకారుడు నవనీత్‌బొక్క తెలిపారు. సంగారెడ్డి జిల్లా భారతీనగర్ డివిజన్‌కు చెందిన నవనీత్‌బొక్క అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నాడు. ఇటీవల ఈజిప్ట్‌లోని కైరోలో జరిగిన అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీల్లో మనం దేశం నుంచి ప్రాతినిధ్యం వహించి, మిక్స్‌డ్ డబుల్స్ బ్యాడ్మింటన్‌లో నాగ్‌పూర్‌కి చెందిన రితికఠక్కర్‌తో కలిసి నవనీత్‌బొక్క కాంస్య పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా బ్యాడ్మింటన్ క్రీడాకారుడు నవనీత్ మాట్లాడుతూ 2026లో జరుగబోయే కామన్‌వెల్త్‌లో బం గారు పతకాన్ని సాధించాలనే లక్ష్యంతో ఉన్నానని తెలిపారు. బ్యాడ్మింటన్‌కు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రో త్సాహం లభించడం లేదన్నారు. సీఎం స్పందిం చి ప్రోత్సహి స్తే కామన్‌వెల్త్‌లో బంగారు పతకమే తన టార్గెట్ అని తెలిపారు.

భూ తగాదాలతో అన్నపై తమ్ముడి దాడి

పాపన్నపేట అక్టోబర్,19 : భూ తగాదాలతో అన్నపై తమ్ముడు కత్తితో దాడిచేసిన సంఘటన మండల పరిధిలోని నామాపూర్‌లో శనివారం చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించి ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ముచ్చె చిన్న రామయ్య, ముచ్చె లక్ష్మయ్య ఇద్దరు అన్నదమ్ములు. రామయ్య కొడుకు లింగయ్య పేరిట 7 గుంటల భూమి ఎక్కువగా నమోదై ఉన్నది. ఆ భూమిని తిరిగి తన పేరిట చేసి ఇవ్వాలని లక్ష్మయ్య కొడుకు కుమార్, లింగయ్యను అడుగుతున్నాడు. ఈ విషయంపై శనివారం గ్రామంలో పంచాయితీ జరుగగా మాట మాట పెరిగి కుమార్ లింగయ్యపై కత్తితో దాడి చేశాడు. దాడిలో గొంతు, తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే తేరుకున్న గ్రామస్తులు కుమార్‌ను చితకబాది గాయాలైన లింగయ్యను 108 వాహనంలో దవాఖానకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మూసీ ప్రక్షాళనపై అఖిల పక్షాన్ని పిలవాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీరయ్య

మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీరయ్య

జహీరాబాద్, అక్టోబర్ 19 : ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, పరిష్కారానికి నోచని సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజల్లో నెలకొన్న అసంతృప్తిని దారిని మళ్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా పేరిట డ్రామాలు ఆడుతుందన్నారు. అఖిల పక్షాన్ని పిలిచి చర్చించిన తర్వాతే మూసీ ప్రక్షాళన చేపటాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి ఎస్. వీరయ్య హెచ్చరించారు. శనివారం జహీరాబాద్ పట్టణంలోని షెట్కార్ ఫంక్షన్ హాల్ రెండు రోజుల పాటు జరిగే సీపీఎం జిల్లా మహాసభల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. జహీరాబాద్ ప్రాంతంలో ని మ్జ్ ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న బాధిత రైతులకు అండగా ఉండి పోరాటం చేసిందన్నారు. అంతకు ముందు పట్టణంలోని సుభాష్ గంజ్ నుంచి ప్రధాన రోడ్డు మార్గం మీదుగా షెట్కార్ ఫంక్షన్ హాల్ వరకు భారీ ర్యాలీని నిర్వహించారు. నాయకులు మల్లికార్జున్, మల్లారెడ్డి, మల్లేశం, జయరాజ్, మల్లేశం, రాజయ్య, రాంచంద్రం, మాణి క్యం, సాయిలు, మహిపాల్, నర్సయ్య, రాజిరెడ్డి, చంద్రన్న, సంగన్న, వీరయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలను వ్యాపారులకు అప్పగించాలి

సంబంధిత శాఖాధికారులు నిర్లక్ష్య ధోరణిపై బీఆర్‌ఎస్ నేతల నిరసన

జహీరాబాద్ మున్సిపల్ శాఖ మేనేజర్ గౌస్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

జహీరాబాద్, అక్టోబర్ 19 : జహీరాబాద్ పట్టణంలో ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ కమర్షియల్ కాంప్లెక్స్ దుకాణాలను వ్యాపారులకు వెంటనే అప్పగించాలని కోరుతూ జహీరాబాద్ పట్టణ బీఆర్‌ఎస్ నేతలు డిమాండ్ చేశారు. వేలం పాటలో దుకాణాలను దక్కించుకున్న వ్యాపారులకు వెంటనే అప్పగించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహా చెప్పి, దుకాణాలకు సంబంధించిన తాళాలను కాంట్రాక్టర్ నుంచి కలెక్టర్ వల్లూరి క్రాంతికి అప్పగించి ఎనిమిది నెలలు గడుస్తున్నా అధికారులెవ్వరూ పట్టించుకోకపోవడం పట్ల శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు నిరసన చేపట్టారు. ఈ విషయమై స్థానిక మున్సిపల్ మేనేజర్ గౌస్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ మాజీ కౌన్సిలర్, సీనియర్ బీఆర్‌ఎస్ నేత నామ రవికిరణ్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో రూ. 11 కోట్ల వ్యయంలో పట్టణంలో ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ కమర్షియల్ కాంప్లెక్స్ 67 దుకాణాలను నిర్మించిందన్నారు. 2023 ఫిబ్రవరి 8న జరిగిన దుకాణాల వేలం పాటలో వ్యాపారులు రూ. 2.50 లక్షలకు 57 దుకాణాలను దక్కించుకున్నారని పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు దుకాణాలను వ్యాపారులకు అప్పగించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండంతో ఆందోళనకు దిగాల్సి వచ్చిందన్నారు. వ్యాపారులకు దుకాణాలను అప్పగించపోవడంతో మున్సిపల్‌కు నెలకు రూ. 6 లక్షల వరకు ఆదాయాన్ని కోల్పోతున్నదన్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు తగుచర్యలు తీసుకొని వేలంపాటలో దుకాణాలను దక్కించుకున్న వ్యాపారులకు అప్పగించాలని, లేని పక్షంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తంజీం, బండి మోహన్, మంజుల, అబ్దుల్లా, ఖలీమ్, సత్యం ముదిరాజ్, శివప్ప, ఇబ్రహీం, దీపక్, శ్రీకాంత్, అఫ్సీ, ఫాహీం, రాజు, సమీ, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

మున్సిపల్ చైర్ పర్సన్ రోజా బాల్ రెడ్డి

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ రోజా బాల్ రెడ్డి

బొల్లారం, అక్టోబర్ 19 : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు బొల్లారం మున్సిపల్ చైర్ పర్సన్ రోజా బాల్‌రెడ్డి అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని 7, 8 వార్డుల్లో రూ. 50లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు చైర్‌పర్సన్ ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రతి వార్డులో అభివృద్ధి పనులను ప్రణాళికా బద్ధంగా చేపడుతున్నట్లు తెలిపారు. పనులను నాణ్యతగా చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కౌన్సిలర్ సతీశ్, ఏఈ కిష్టయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్, స్థానికులు పాల్గొన్నారు.

గుడికి విరాళం

హనుమంతుడి ఆలయానికి విరాళం అందజేస్తున్న ఏసయ్య

రాయికోడ్, అక్టోబర్ 19 : మండల కేంద్రమైన రాయికోడ్‌లో నూతనంగా నిర్మిస్తున్న హనుమంతుడి ఆలయానికి శనివారం రాయికోడ్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏసయ్య రూ.1.51 లక్షలు విరాళంగా అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయ న మాట్లాడారు. అన్ని మతాలను గౌరవించాలన్నారు. ఆధ్యాత్మిక సేవలో తను ఎల్లప్పుడు ముందుంటాన్నారు.

రికార్డుల పరిశీలన

కోహీర్, అక్టోబర్ 19 : రైతులకు అందించిన ఎరువులు, మందుల వివరాలను రికార్డుల్లో సక్రమంగా నమోదు చేయాలని జహీరాబాద్ డివిజన్ వ్యవసాయాధికారి భిక్షపతి ఫర్టిలైజర్ దుకాణాల డీలర్లను ఆదేశించారు. శనివారం కోహీర్ పట్టణంలోని ఫర్టిలైజర్ దుకాణాలతో పాటు దిగ్వాల్ ఆంజనేయ ఫర్టిలైజర్‌లో రికార్డులను పరిశీలించారు. ఈ-పాస్ ద్వారా పంపిణీ, దుకాణంలో ఉన్న నిల్వ వివరాల రికార్డుల్లో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏవో నవీన్‌కుమార్ ఉన్నారు.

లక్ష్మీపతిగూడెంలో చోరీ

జిన్నారం, అక్టోబర్ 19 :మండలంలోని లక్ష్మీపతిగూడెంలో శనివారం పట్టపగలు చోరీ జరిగింది. గ్రామానికి చెందిన బొంతు జనార్దన్, బొంతు జ్యోతి భార్యాభర్తలు. ఉపాధి కోసం భర్త షాపూర్ నగర్‌కు వెళ్తుండగా భార్య వ్యవసాయ పనులకు వెళ్తుంది. శనివారం భార్యాభర్తలు ఇద్దరు రోజు మాదిరిగానే ఇంటికి తాళం వేసి వారి పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి రాగా తాళం పగులగొట్టి ఉన్నది. ఇంట్లోకి వెళ్లి చూడగా తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువా తెరిచి నాలుగు తులాల బంగారం, ఆరు తులాల వెండి, రూ.నలభై వేల నగదు చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే జిన్నారం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వచ్చి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నిబద్ధతతో పని చేయాలి

నాగల్‌గిద్ద, అక్టోబర్ 19 : ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపుతోపాటు ఉత్తమంగా తీర్చిదిద్దే విధంగా కృషి చేయాలని పీఆర్టీయూ మండలాధ్యక్షుడు రమేశ్ అన్నారు. శనివారం మండలంలోని వివిధ పాఠశాలను సందర్శించారు. విధుల్లో చేరిన ఉపాధ్యాయులను అభినందించారు.

మొరం అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

వట్‌పల్లి,అక్టోబర్ 19 : అక్రమంగా మొరం తరలిస్తున్న ట్రాక్టర్‌ను రెవెన్యూ సిబ్బంది పట్టుకున్నారు. శనివారం వట్‌పల్లి శివారులో అక్రమంగా మొరం తవ్వకాలు జరుగుతున్నాయనే సమాచారంతో రెవెన్యూ సిబ్బంది గాలింపులు చేపట్టగా, మొరం తరలిస్తున్న ట్రాక్టర్ అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మొరం తవ్వకాలు జరుగుతున్న స్థలాన్ని పరిశీలించగా, అక్కడ ఎటువంటి వాహనాలు కనబడకపోయే సరికి వెనుదిగారు. మొదటి సారిగా పట్టుబడిన ట్రాక్టర్‌కు ఐదు రూ. 5వేలు జరిమానా వేసి యజమానిని మందలించారు. మండలంలో ఎక్కడ అనుమతులు లేకుంగా అక్ర మ తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

నగదు ప్రోత్సాహం

హత్నూర, అక్టోబర్19 : హత్నూర మండలం నాగారం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 9,10 తరగతులకు చెందిన 10 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. వెయ్యి చొప్పున స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అందజేశారు. విద్యలో రాణించినందుకుగాను విద్యార్థులకు ప్రోత్సాహకంగా నగదు అందజేసినట్లు ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్‌రావు తెలిపారు.